క్లుప్తంగా

పెదపెంకిలో కందుకూరి వీరేశలింగం జయంతి



వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంజీవనాయుడు

బలిజిపేట: కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి కార్యక్రమాన్ని పెదపెంకిలోని నేతాజీ గ్రంథాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుకవి వీరేశలింగం తెలుగువారి గొప్పతనాన్ని చాటిచెప్పారని సంజీవనాయుడు ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో ఎం.చిన్నంనాయుడు, పి.రాము, పి.శ్రీను, ఎస్.జగదీష్, జి.శ్రావణ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



కోట్ల వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: మండలంలోని డోకిశీల పంచాయతీ, చెలంవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోట్ల వెంకటరమణ కుమారుడు సందీప్ (27) ఇటీవల ప్రమాదవశాత్తు అకాల మరణం చెందాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి జరిగిన ఘటన తెలుసుకుని చింతిస్తూ, అంది వచ్చిన కొడుకు అకాల మరణం కన్న తల్లిదండ్రులకు తీవ్ర గర్భశోకం మిగిల్చిందంటూ విచారం వ్యక్తంచేశారు. తన ప్రగాఢ సానుభూతి తెలియచేసి వారికి ధైర్యం చెప్పి ఎప్పుడూ అండగా ఉంటామని చెప్పి భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అవగాహన తప్పనిసరి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం టౌన్: ప్రజలు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కలిగిఉండి చుట్టుపక్కల వారిని చైతన్యవంతులుగా చేసి ప్రమాదాలు నియంత్రించవచ్చునని అగ్నిమాపక అధికారి పి.పైడిరాజు అన్నారు. ఈ మేరకు జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని అపార్ట్‌మెంట్ల వద్ద అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణమయ్యే గాలి, మండే పదార్థం వేడిలలో ఒక దానిని అదుపుచేస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాలు ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియజేశారు. ఇళ్లలో వంటగ్యాస్ ప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలి? ఎలా నియంత్రించాలనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి భద్రత పెంచాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి



సాలూరు: ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు భద్రత పెంచాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఓటమి భయంతో రాష్ట్రంలో టీడీపీ కూటమి శ్రేణులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యా ప్రయత్నం హేయమైన చర్యని అన్నారు. ముఖ్యమంత్రితో పాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు భద్రత పెంచాలని కోరారు. కాగా సాలూరు గిరిజన నియోజకవర్గమని, ఇక్కడ గతంలో నక్సల్స్ కదలికలున్న సంఘటనలను గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు భద్రత పెంచాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు చెక్ పోస్టుల ఏర్పాటు

సీతానగరం: ఎన్నికల సమయం సమీపిస్తున్న కారణంగా ఆర్డీఓ కె.హేమలత ఆదేశాల మేరకు రెండు చెక్‌పోస్టులు మంగళవారం ఏర్పాటు చేసినట్లు సీతానగరం తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు తెలియజేశారు. నామినేషన్ల స్వీకరణ 18 నుంచి జరుగుతున్న కారణంగా రాష్ట్ర రహదారిపై లచ్చయ్యపేట, సీతానగరం హనుమాన్ జంక్షన్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

ఎన్ని కూటములొచ్చినా మళ్లీ జగనే సీఎం

- ఎమ్మెల్యే జోగారావు



పట్టణంలో 29వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్: ఎన్ని పార్టీలు జతకట్టి వచ్చినా ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 29, 5వ వార్డులలో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసగించేందుకే చంద్రబాబు కూటమి కట్టారన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజారాణిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత పురోభివృద్ధిలోకి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. మే నెల 13న జరగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఇళ్లస్థలాలు, సొంతింటి స్థలం ఉన్న వారికి ఇళ్లు, విద్యుత్ లైన్లు, రోడ్ల సమస్యను వార్డులోని పార్టీ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరించామని చెప్పారు.

మంచి జరిగి ఉంటే ఓటు వేయండి

జగనన్న సీఎం కాగానే ప్రజల అవసరాలను నాయకులు, కార్యకర్తల సహకారంతో తీరుస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్ల పాలనలో మీకు మంచి జరిగిందనుకుంటేనే ఓటు వేయండని ధైర్యంగా అడుగుతున్న దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. మీ అందరి చల్లని ఆశీస్సులతో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని, గత టీడీపీ పాలనలో జరిగిన అరాచకాలను గుర్తుకు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కుల, మతాలు, వర్గాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ జమ్మాన్న ప్రసన్నకుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వార్డు కౌన్సిలర్ గొర్లి మాధవరావు, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్టేట్ డైరెక్టర్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, పెద్దలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిబ్బంది సహకారంతో శతశాతం ఉత్తీర్ణత

- కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు సత్కారం



ప్రిన్సిపాల్ సంధ్యను సత్కరిస్తున్న డీసీడీఓ రోజారమణి, డీఈఓ పగడాలమ్మ

సీతానగరం: మండలంలోని జోగింపేట మహిళా కేజీబీవీలో ఉపాధ్యాయినులు, సిబ్బంది పరస్పర సహకారం, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతోనే ఇంటర్మీడియట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించామని డీసీడీఓ కె.రోజారమణి అన్నారు. జోగింపేట మహిళా కేజీబీ విద్యాలయంలో శాతశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ జొన్నాడ సంధ్యను జిల్లా విద్యాశాఖ అధికారిణి పగడాలమ్మతో కలిసి డీసీడీఓ కె.రోజారమణి సోమవారం రాత్రి సత్కరించారు. ఈ సందర్భంగా డీసీడీఓ రోజారమణి మాట్లాడుతూ విద్యాలయాల్లో ఉపాధ్యాయులు విద్యాబోధనకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, విద్యార్థులకు కనీస అవసరాలు కల్పించడానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతోనే విద్యార్థులు విద్యపట్ల ఆసక్తి చూపుతున్నారని అన్నారు. డీఈఓ పగడాలమ్మ మాట్లాడుతూ జోగింపేట గ్రామం విద్యాలయాలకు నిలయంగా మారిందని ప్రశంసించారు. ఏటా పరీక్షల ఫలితాలు ఇలాగే కొనసాగించాలని కోరారు. ప్రిన్సిపాల్ సంధ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సిబ్బంది సహకారం, పేరెంట్స్ సహకారంతో మంచిఫలితాలు సాధించగలిగామన్నారు. సన్మాన కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.తులసి, ఎస్ శోభారాణి, టి కనకమ్మ, ఎస్ సురక్ష, జి పుష్పలత, శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై దాడి చేసిన నిందితులను చట్టప్రకారం శిక్షించాలని జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబు తదితరులు కోరారు. పట్టణంలో స్థానిక విలేకర్లతో వారు మంగళవారం మాట్లాడారు. ,ప్రజాభిమానం నిండుగా ఉన్న జగన్ మోహన్‌రెడ్డి, రానున్న ఎన్నికల్లో మరలా ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్ని సర్వేలు తెలుపుతున్న నేపథ్యంలో ఆ ఉక్రోశం, కోపంతో జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ, జనసేన కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. దాడిని కూటమి నేతలు, ఎల్లో మీడియా వక్రీకరించడం దారుణమన్నారు. కాగా సాలూరు ఏజెన్సీ నియోజకవర్గమని సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. కావున ఇక్కడ ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరకు భద్రత పెంపుపై ఎన్నికల కమిషన్ ఆలోచించాలని కోరారు. వారి వెంట పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు తదితరులు ఉన్నారు.

'ఏకలవ్య' పరీక్ష ఫలితాల్లో జాతీయ గుర్తింపు



ఉపాధ్యాయిని రెడ్డి సింహాచలం

సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామానికి చెందిన ఆర్ సింహాచలమ్మ ఇటీవల కేంద్రప్రభుత్వం జాతీయస్థాయిలో నిర్వహించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉపాధ్యాయిని నియామకం పరీక్షల్లో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో సింహాచలం రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలవగా ఆలిండియా ఓబీసీ కేటగిరీలో 30వ స్థానం సాధించింది. ప్రస్తుతం ఆమె సాలూరు మండలంలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ బాలికల గురుకుల విద్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయరాలిగా విధులు నిర్వహిస్తున్నారు. సింహాచలం భర్త పోలినాయుడు గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.జాతీయ స్థాయిలో ఉత్తీర్ణత సాధించడానికి తన కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే తాను ప్రతిభ కనబరచగలిగినట్లు ఆమె తెలియజేశారు. జాతీయస్థాయిలో ప్రతిభకనబర్చిన ఉపాధ్యాయిని రెడ్డి సింహాచలంకు స్థానిక సర్పంచ్ కురమాన రాధ, సచివాలయం కన్వీనర్ కె.శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గంట రమేష్, రెడ్డి సత్యం, సింహాచలం సహచరులు అభినందనలు తెలియ జేశారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

సీతానగరం:



బక్కుపేటలో మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

త్వరలో జరగనున్న సాదారణ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. ఈ మేరకు మండలంలోని బక్కుపేటలో ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్, ఎన్నికల సమయంలో తీసుకోవలసిన అంశాలపై గ్రామంలో ప్రజలతో సోమవారం రాత్రి అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ మే నెల 13న జరగనున్న సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కలిగేలా, ఎన్నికలు ప్రశాతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రజల సంయమనం పాటించి ఓటుహక్కు ఉన్నవారంతా పోలింగ్ సమయంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. అలాగే అన్ని గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులనుంచి అనుమతులు తప్పినిసరి అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జి అప్పారావు, బక్కు సూర్యనారాయణ, టి అప్పారావు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలబడదాం



ఇంటింట ప్రచారం చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ

సాలూరు రూరల్: సంక్షేమ పాలనకు మనమంతా అండగా నిలబడాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ అన్నారు. నార్లవలస పంచాయతీ నార్లవలస, జల్లేడువలస, గాదిలవలస, సీతందొరవలస, బురకోనవలస గ్రామాలలో ఇంటింట మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలు ఇదివరకు ఎన్నడూ ఏ నాయకుడు అందించలేదన్నారు. ఇలాంటి నాయకుడుని మళ్లీ మనం సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. సాలూరు నియోజగవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మన నాయకుడు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను గెలిపించుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా పంపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మూర్తి, సీదరపు అనూష తదితరులు పాల్గొన్నారు.

ఆ చేరికలు ఉత్తివే...

సాలూరు రూరల్: మండలంలోని పలు గ్రామాలలో టీడీపీ నాయకులు వారి పార్టీ కార్యకర్తలకు కండువాలు కప్పుకొని వైఎస్సార్‌సీపీ నుండి చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఇదంతా ఉత్తిదేనని మండల వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జీగిరాం ఎంపీటీసీ అల్లు సూరప్పలనాయుడు, నెలిపర్తి నాయకుడు ఎద్దు వేణు అన్నారు. వీరు విలేకర్లతో మంగళవారం మాట్లాడారు. టీడీపీ కండువాలు వారికి వారే కప్పుకుని డ్రామాలు ఆడుతున్నారన్నారు. నెలిపర్తి గ్రామంలో పార్టీలో చేరినట్లు ప్రకటించుకున్నారని అందులో నిజం లేదన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా

- వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని స్పష్టీకరణ



పార్వతీపురం టౌన్: ఎంపీడీఓ అకీబ్ జావేద్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



పార్వతీపురం టౌన్: ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వలంటీర్లు



బలిజిపేట: ఎంపీడీఓ కార్యాలయం వద్ద రాజీనామా పత్రాలను సమర్పించిన వలంటీర్లు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని నర్సిపురం, తాళ్లబురిడి, డోకిశీల, పెదబొండపల్లి, చిన్న బొండపల్లి, గంగాపురం, బందలుప్పి, బులగ సచివాలయాలకు చెందిన 83 మంది వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ అకీబ్ జావేద్‌కు వారి రాజీనామా పత్రాలను అందజేశారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు తెలియచేయడంలో ప్రతిపక్షాలు అడ్డుకోవడంతో వలంటీర్లు తమ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల గురించి తెలియచేసి మళ్లీ రాష్ట్రంలో ప్రజలకు మంచి జరగాలంటే అది జగన్ అన్నతోనే సాధ్యమని తెలుసుకుని, జగనన్నని, జోగారావును గెలిపించాలన్న ఉద్దేశంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రాజీనామా పత్రాలను అందచేశామని వలంటీర్లు స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన వలంటీర్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైన, తమ ఎమ్మెల్యే అలజంగి జోగారావుపై జరిగిన దాడికి తీవ్రంగా కలత చెందుతూ తామంతా స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు వలంటీర్లు తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం మండలానికి చెందిన వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ కండువాలు వేసుకుని వైఎస్సార్‌సీపీలో చేరి జగనన్న వీర సైనికుల్లా పని చేస్తామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ తమ నాయకులు జగనన్నను, జోగన్నలను గెలిపించుకునేందుకు రాత్రింబవళ్లు పనిచేసే వచ్చే ఎన్నికల్లో అఖండ విజయానికి కృషి చేస్తామన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: మండలంలో వలంటీర్ల రాజీనామా పర్వం ప్రారంభమైంది. సీఎం జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుపై జరిగిన దాడి సంఘటనకు నిరసనగా రాజీనామాలు చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు. అందులో భాగంగా చిలకలపల్లి, బలిజిపేట, మిర్తివలస, బర్లి, సుభద్ర, పి.చాకరాపల్లి, నూకలవాడ, నారాయణపురం, పెదపెంకి సచివాలయాలకు సంబంధించిన వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఆయా సచివాలయ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయానికి అందజేశారు. అనంతరం వారు ఎమ్మెల్యే జోగారావును పార్వతీపురంలో కలిసి పార్టీ గెలుపుకోసం మేము సైతం సిద్ధమంటూ వారి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

- సాలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్



సాలూరు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని సాలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ తెలిపారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు నియోజకవర్గం కావడంతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. మే 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. ఆ వివరాలు..

సాక్షి: తొలిసారి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఓ ఏజెన్సీ నియోజకవర్గంలో విధులు నిర్వర్తిస్తుండడం మీకు ఏ విధంగా అనిపిస్తుంది?

ఆర్ఓ: తొలిసారిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నాను. ఇది ఏజెన్సీ నియోజకవర్గం కావడం మరింత ప్రత్యేకం. ఇక్కడ ప్రజలు ఓటు వేస్తున్నది వారి ప్రజలు భవిష్యత్ కోసమేనని ఆలోచిస్తూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వచ్ఛందంగా ఆసక్తి చూపిస్తుండటం గుర్తించాం. ఇది ప్రజాస్వామ్యంలో చాలా కీలకమైన శుభ పరిణామం.

సాక్షి: ఏజెన్సీ నియోజకవర్గం.. ఓటరును ఎలా చైతన్యం చేస్తున్నారు?

ఆర్ఓ: ఏజెన్సీలో ఓటరును చైతన్యం చేసేందుకు మా వంతు విరివిగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ఓటింగ్ శాతం ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నాం.

సాక్షి: ఆంధ్రా – ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై మీరు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఆర్ఓ: ఓటరు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. కొటియా గ్రూప్ గ్రామాల అంశంపై ముందుగా వీఆర్ఓలు, బీఎల్ఓలు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాం. అక్కడ అధిక శాతం మంది ప్రజలు ఆంధ్రా వైపు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుసుకున్నాం. మన కలెక్టర్, ఎస్పీలు కొరాపుట్, రాయగడ కలెక్టర్, ఎస్పీలతో సమావేశమయ్యారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తరువాత కొటియా గ్రామాలపై మరింత దృష్టి పెడతాం. మన ఎన్నికల అబ్జర్వర్ గతంలో కొరాపుట్ కలెక్టర్‌గా పని చేశారు. ఈ కొటియా అంశం ఆయనకు తెలుసు. ఇది కాస్త సానుకూలాంశం.

సాక్షి: నియోజకవర్గంలో మెంటాడ మండలం విజయనగరానికి చెందుతుంది. ఇక్కడ పోలింగ్, ఓట్ల లెక్కింపు అంశాలు ఎలా ఉంటాయి?

ఆర్ఓ: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగు సిబ్బందిని విజయనగరం జిల్లా అధికారులు కేటాయిస్తారు. వారికి శిక్షణ, వారి సేవలు వినియోగించుకోవడం తదితర పర్యవేక్షణ బాధ్యతలను రిటర్నింగ్ అధికారిగా నేను చూస్తున్నాను. సాలూరు డిగ్రీ కళాశాల నుంచే పోలింగ్ సామగ్రిని మెంటాడ మండలంలో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు తీసుకువెళ్తారు. పోలింగ్ ముగిసిన తరువాత వాటిని పార్వతీపురం సమీపంలో ఉల్లిభద్ర వద్ద గల ఉద్యానవన కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తాం.

సాక్షి: నియోజకవర్గంలో సమస్మాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారా?

ఆర్ఓ: 39 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక ప్రాంతాలుగా తెలుపుతూ పోలీసులు నివేదిక ఇచ్చారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు కేంద్ర బలగాలను పంపించడంతో పాటు, వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు , మైక్రో అబ్జర్వర్‌లను పంపిస్తాం. ఇప్పటికే 125 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ అవసరమని కలెక్టర్‌ను కోరాం.

సాక్షి: అభ్యర్థులకు ఎటువంటి సూచనలు ఇస్తున్నారు?

ఆర్ఓ: అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అనుమతులు తీసుకోవాలి. ఎక్కడ గడపగడపకు వెళ్లి ప్రచారం చేస్తారో వారు సంబంధిత ఎస్‌హెచ్ఓ, తహసీల్దార్ తదితర ఎన్నికల అధికారులకు సమాచారం ముందుగానే అందిస్తే సరిపోతుంది.

సాక్షి: నియోజకవర్గంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి?

ఆర్ఓ: నియోజకవర్గంలో సాలూరు మున్సిపాలిటీ, సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల్లో 243 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడ 32 సెక్టార్, 25 రూట్ అధికారులను నియమించారు.

సాక్షి: ఓటర్లకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి?

ఆర్ఓ: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. ఓటర్లందరూ తమ ఓటు హక్కును వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో తప్పక వినియోగించుకోవాలని కోరుతున్నాం.

మళ్లీ అవకాశం ఇవ్వండి...



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట: ఇచ్చిన మాట ప్రకారం మీకు మంచి చేసానని, మరోసారి నన్ను ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కోరారు. మండలంలో గిరిశిఖర శతాబి గ్రామంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. తమ గ్రామానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రికి స్థానికులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. మహిళలతో కలిసి రాజన్నదొర థింసా నృత్యం వేయడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజన్నదొర మాట్లాడుతూ, నిజమైన గిరిజనుడుగా గిరిజనుల కష్టాలు నాకు తెలుసునని అన్నారు. అందుకే ఇక్కడ రోడ్లు, వంతెనలు తదితర అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. గిరిజనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని వివరించారు. కోట్లాది రుపాయిలతో సంక్షేమ ఫలాలు, అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గతంలో తాను ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు ఇక్కడ బీటీ రోడ్డు కావాలని ప్రజలు కోరగా ఇక్కడ రోడ్డు నిర్మాణం చేయిస్తానని నాడు హామీ ఇచ్చి ఆ హామీ నెరవేర్చి మీకు రోడ్డు వేసి నేడు అదే బీటీ రోడ్డు గుండా మీ వద్దకు వచ్చానని పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నాకు తోడుగా నిలుస్తూ, జగన్‌మోహన్‌రెడ్డికు అండగా నిలవాలని ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కొర్రజన్ని సింహాచలం, పార్టీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జి, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, జేసీఎస్ కన్వీనర్ టి.గౌరిశ్వరరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు సోముల లచ్చయ్య, డోనేరు లచ్చయ్య,మాదల సింహాచలం,కొర్రా బుచ్చిబాబు,చెదల రాజు,శిల్పజన్ని రామయ్య,గండిపల్లి రాము,ఇజ్జాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళామేట్లకు ఉపాధి పనులపై అవగాహన



మాట్లాడుతున్న ఉపాధి ఏపీఓ భాను

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పనుల నిర్వహణపై ఇచ్చిన శిక్షణ కార్యక్రమాన్ని మహిళా మేట్‌లు అవగాహన కల్పించుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ఉపాధిహామీ పథకం పనులు నిర్వహణలో కీలకంగా ఉన్న మహిళా మేట్‌లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఓ భాను మాట్లాడుతూ మహిళా మేట్‌లు వేతనదారులకు పనులు కల్పించడం, మస్టర్ వేయడంలో మెలకువలు పాటించడానికి శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. వేతనదారులు రోజువారీ చేస్తున్న పనుల కొలతలు, గిట్టుబాటు వేతనం, సామాజిక పరమైన ఉపాధి హామీ పనులు చేట్టడానికి ప్రణాళికలు తయారు చేయడానికి శిక్షణ దోహదపడుతుందన్నారు. మండలస్థాయిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు కల్పించడానికి మేట్‌లు క్రియాశీలకంగా సేవలందిస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ స్థాయిలో టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.